# ప్రేమ సమాజం

శ్రీ పి. వి. తాతాచారి

ప్రాతఃకాలము ఆరుగంటలయింది. సీతాకాలపు సూర్య భగవానుడు తన లేత వేడికిరణాలచేత గిలిగింతలు పెడుతూ 'యింకా నిద్రేనా! లే' అని సూర్యాన్ని మేలుకొలిపేడు. సూర్యం కండ్లు నులుపుకుంటూ, మంచాన కూర్చొని ఆశ్చర్యంతో తూర్పునకు తిరిగేడు. ఆదిశనుండి వస్తూన్న అవ్యక్తపు ధ్వని సూర్యాన్ని ఆశ్చర్యంతో ముంచింది. కొన్ని క్షణాలలో ఆధ్వని 'ఇదీ' అని చెప్పడానికి వీలుపడింది.

మద్దెలల వాయింపులు! ఆర్మోనియముల సరిగమలు!! సానాయిల మధుర స్వరములు!!! యివే కొంతవరకు పాటగాండ్రను మఱుగు జేస్తూయున్నవి.

'ఏమిటూ ?' అని సూర్యం, 'కరుణామయీ!' అని ఒక్క కేక వేసేడు. అతిస్వల్ప కాలంలోనే కరుణ చేతపూలనుగొని 'ఏమండీ' అంటూ సూర్యం మంచంవద్దకువచ్చి నిలువబడింది. తెల్లవారకమునుపే స్నాన పానములు నిర్వర్తించి, పూజకై సిద్ధముగానున్న కరుణను చూచి 'తెలిసీ తెలియని ఆధ్వని యేమిటీ కరుణా!' అనిసూర్యం ప్రశ్నించాడు తన ధర్మపత్నిని.

'కట్టడానికి బట్ట, తినడానికి తిండీ యిచ్చి, బీదవారిని రక్షించడమే తమపనని యెంచి తెల తెలవారగనే ప్రేమ సమాజంవారు ధనాన్ని దండడానికి బయలుదేరారు. ఆధ్వనులే అవి! ఆ పాటలు వారే పాడుచున్నారు!! లెండి! మీకుతోచింది మీరూ యివ్వండి!' అని అంది కరుణ.

ఆమాటవిని అమాయకంగా, ఆరేండ్ల పసిపాప 'నాన్నా! నిజంగా ప్రేమ సమాజంవారు దండిన సొమ్మును బీదసాదలకే వినియోగిస్తారా!' అని అంది. ఆమాటలో ఎంత అర్థమిమిడి వుందో కదా!

'వెఱ్ఱిపిల్ల! నీవడిగిన ప్రశ్నకు జబాబు చెప్పవలసిందే' అని మంచాన కూర్చున్న సూర్యం దిగ్గునలేచి తన జేబులో ఏముందని కరుణను ప్రశ్నించాడు. గభాలున కరుణ లోనికేగి జేబులన్నియు వెదకి ఒక అణాను మాత్రమేతెచ్చి 'ఉన్నదిది' అని అందించింది తన భర్తకు.

'కరుణా! ఆ అణాను శారదకియ్యి. మనశారద అడిగిన ప్రశ్నకు జబాబు చెప్పగలవా? చదువుకున్నదానవు'. అని అన్నాడు సూర్యం.

'నా ఉద్దేశ ప్రకారం వారంతా ధన్యజీవులు! పేదవారిని రక్షించడమే తమ కర్తవ్యమని నిత్యం రాత్రినక పగలనక, ఎండనక వాననక కష్టపడుతూన్న ఉత్తములు!! ఈ విషయంలో వారు పూజ్యులు!!!" అని అంది కరుణ చిరునవ్వును వెదజల్లుతూ.

'కరుణా! నీవుచాలా పొరబడ్డావు. నిజానికి నీవు చదువుకున్న దానవే కాని మిక్కిలి అమాయకురాలవు. లోకంలో వివిధవ్యక్తుల బుద్ధులను పరిశీలించడానికి నీకు విజ్ఞానమును భగవంతుడీయనందుకు చాలావిచారిస్తున్న' అన్నాడు సూర్యం భావగర్భిత హృదయంతో.

ఇంతలో ప్రేమ సమాజంవారు వివిధరకాల పాటలలో వారింటి దగ్గరలోకి వచ్చారు. ముందు యిద్దరు వ్యక్తులు రెండుడబ్బాలతో 'బాబూ! మీకుతోచింది యిందులో వెయ్యండి, అంటూ 'వచ్చీపోయే' జనాన్ని అడుగుచూ యింటింటికినీ పోయి డబ్బాలు చూపుతున్నారు. ఎవరికి తోచింది వారు 'కానియో పరకో' వేస్తున్నారు డబ్బాలలో.

సూర్యం యింటికి కూడావచ్చారు ప్రేమ సమాజంవారు. 'అమ్మా! శారదా! అమ్మయిచ్చిన ఆ అణాడబ్బులు డబ్బీలోవేయమ్మా!' అన్నాడు సూర్యం.

ఒక వ్యక్తి డబ్బాను పట్టుకొని చేయి చాచడం, శారద ఆ డబ్బీలో ఆ నాలుగుడబ్బులు వేయడం, నకనకలాడుతూ, నోట మాటనురాక, అతి నీరస స్థితిలో నున్నమరో బిచ్చగాడు ఆ యింటి ముంగిట నిలువబడి అమ్మా! అని అనడం యీ మూడుపనులూ ఒక్క క్షణంలో జరిగినవి. డబ్బీలో ఆ అణాపడగనే,

ప్రేమ సమాజంవారు ఆ యింటిని మరు క్షణంలోనే దాటేరు.

ఈ దృశ్యాన్ని కండ్లార చూచిన ఆ కరుణామయి గుండెలు తరుక్కుపోయింది! నిజాన్ని గ్రహించింది!! తనది తప్పని భావించింది!!! కన్నీరుకూడా కార్చింది. అమ్మ కన్నీరునుచూచి ఆ పసిపాప శారద కూడా కంట తడి బెట్టింది.

శారద కండ్లు కన్నీటితో నిండియుండడం చూచి దగ్గఱకు లాగుకున్నాడు.

"కరుణా! చూచావా! నిజంగా యీ ప్రేమ సమాజం వారు బీదసాదలను ఆదరాభిమానాలతో చూస్తే యీ బిచ్చగాండ్రు మరల, నింటింటికి వచ్చి, బిచ్చమెత్తడం దేనికి? యిందాక వచ్చిన బిచ్చగాడు 'అమ్మా!' అని మనవైపు తిరిగి చూచునపుడు వారు చెంతనే య్యున్నారుగదా తమ డబ్బిలోనున్న రెండు కానులను ఆ బిచ్చగానికి యిస్తే యెంత బాగుండును! మన ప్రత్యక్షంలోనే వీరినింత నిర్దయగా యీ సమాజంవారు చూస్తే మన పరోక్షంలో వారికి డబ్బు వ్యయపరచి కూడా గుడ్డాయిస్తారని ఏమినమ్మకం!!" అని శారద కండ్లు తుడచి, లోనికి ముగ్గురూపోయేరు.

---

## కరువు కథ!

(అగర్భ శ్రీమంతులు - అగర్భ దరిద్రులు)

తిండిగింజలకు కట కట
మండుటెండలో నడకట
మీదుమిక్కిలి తిండిట
కడుపుబాధలతో మూల్గుట

చీరలేకయే సిగ్గుట
మానముకోసరం మగ్గుట
చీరలపై చీరలట
చినిగిన పేలికలు దానమట

పంచభక్ష పరమాన్నాలట
విందులతో బహుకులాసట
త్రాగను గంజేలేదుట
పస్తులతో ఆఖరిచావట

పిల్లలచాక్రీ రాలేక విసుగుట
చాలు, చాలు అని దండమట
చీముడిముక్కుల సంతట
భలేలక్షాధికారి బిడ్డలట.

క్యూలోనిలపడి వృత్తిచేతులతో రాకట
ఇంట్లోపసికందుల బాధలట
స్టోరే నిర్మించాడుట
భలే సోకుగ ధర్మలింగంచెట్టట!

అయ్యారే రామచంద్రరావింట
హాయ్యారే బియ్యపు మూటలు
మెతుకైకయుగమే బీదలకంట
గతికి కలకాలమేమి వారుచేస్తారంట

కరువురోజులలో బీదల సోదలట
బరువేకాదా అని పెద్దల గుస గుసలట
కాలం, స్వతంత్రం బీదలదట
అన్నం, డబ్బు మహారాజులదట

కరువు, బరువు బీదలదట
పరువు, డబ్బు, కీర్తి మహారాజులదట

మిస్. నిరుపమ గురుకల్